RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in

సంపుటి : 13 సంచిక : 297 | ఆదివారం 12 ఏప్రిల్ 2026 | ఎడిటర్ : బత్తు లక్ష్మీనారాయణ, | పేజీలు :6 వెల : రూ. 5.00

Hyderabad, Vijayawada, Vishakapatnam Tirupathi, Ananthapuram,Guntur,Nellor,Ongole,kadapa, Medak, Sangareddy, Siddipet, Nalagonda, Karimnagar,

# జ్యోతిరావు పూలే చిత్రపటానికి ఘన నివాళులు అర్పించిన ముఖ్యమంత్రి



## పూలే స్ఫూర్తితో సామాజిక న్యాయానికి దిశా నిర్దేశం సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఏప్రిల్ 11:- సామాజిక సమానత్వం, విద్యా విస్తరణకు జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఆయనకు ఘన నివాళులు అర్పించారు. ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, అణగారిన వర్గాల సామాజిక న్యాయం కోసం, మహిళల విద్యాభివృద్ధి కోసం పూలే చేసిన పోరాటం భారత సమాజానికి దిశానిర్దేశం చేసిందని పేర్కొన్నారు. సమాజంలో సమానత్వం, హక్కుల పరిరక్షణ, విద్యా విస్తరణ వంటి అంశాల్లో ఆయన చూపిన మార్గం ఈ తరానికి కూడా ప్రేరణగా నిలుస్తోందని తెలిపారు.తెలంగాణ ప్రభుత్వం కూడా పూలే ఆశయాలను ఆచరణలో పెట్టే దిశగా పలు కీలక నిర్ణయాలు తీసుకుంటోందని సీఎం గుర్తుచేశారు. ముఖ్యంగా సమగ్ర కుల గణన, ఎస్సీ ఉపకులాల వర్గీకరణ వంటి అంశాలు సామాజిక సాధికారతను మరింత బలపరచే చర్యలుగా ఆయన వివరించారు. సమాజంలోని ప్రతి వర్గం అభివృద్ధి చెందేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ మల్లు రవి, కూడా పాల్గొని, మహాత్మా పూలే చిత్రపటానికి నివాళులు అర్పించారు. పూలే ఆలోచనలు, సిద్ధాంతాలు సమాజాన్ని ముందుకు నడిపించే శక్తిగా నిలుస్తాయని వారు అభిప్రాయపడ్డారు.మొత్తంగా, మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయన సేవలను స్మరించుకుంటూ, సామాజిక న్యాయం, సమానత్వం కోసం తెలంగాణ ప్రభుత్వం మరింత దృఢంగా ముందుకు సాగుతుందనే సంకల్పాన్ని నాయకులు వ్యక్తం చేశారు.

## అమీన్‌పూర్‌లో హైడ్రా

# అత్యంత భారీ ఆపరేషన్...

## రూ.15 వేల కోట్ల విలువైన భూమికి రక్షణ



అమీన్‌పూర్‌లో హైడ్రా, రెవెన్యూ, మున్సిపల్, పోలీస్ శాఖల సంయుక్త ఆపరేషన్

రూ.15,000 కోట్లకు పైగా విలువైన 861 ఎకరాల ప్రభుత్వ భూమి స్వాధీనం

భూకబ్జాదారుడు ముఖీంకు చెందిన గెస్ట్ హౌస్, ఫామ్‌హౌస్‌ల కూల్చివేత

ఖాళీ స్థలానికి ఫెన్సింగ్... పేదల ఇళ్లకు ఇబ్బంది లేదని ప్రభుత్వ హామీ

సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో హైడ్రా అత్యంత భారీ ఆపరేషన్ చేపట్టింది. శనివారం నాడు హైడ్రా, రెవెన్యూ, మున్సిపల్, పోలీస్ శాఖలు సంయుక్తంగా నిర్వహించిన ఈ మెగా ఆపరేషన్‌లో సుమారు 861 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నాయి.

# నా..మాట!

న్యాయం ఎక్కడుంది ప్రజాసౌమ్యమా..  
పేదోడి గూడు చెదరకొట్టి,  
ఉన్నోడి ప్రహరీ గోడ కూడ కూల్చారాయే..  
హైడ్రా ఎవరి కోసం పనిచేస్తుంది,  
సామాన్యుడికి న్యాయం ఎక్కడ దొరుకుంది..  
ఖమ్మం సంఘటన కన్నీళ్లు పెట్టిస్తుంది..  
పసిపిల్లలను చూస్తే గుండె తరుక్కపోతుంది..  
ఇండ్లు కోల్పోయిన బాధితుల బాధలు,  
ఏ దేవుళ్ళకు వినబడుతుంది..  
ఈ భూమి మీద పేదలకు బ్రతికే హక్కు లేదా?  
వందల ఎకరాలు కబ్జాలు చేసినోళ్లను ఎవడు పట్టుకుంటాడు..  
ప్రజాదనాన్ని లూటి చేసిన దొంగలను ఎప్పుడు జైల్లో పెడతారు..  
ప్రభుత్వాలు,ప్రజాప్రయోజనాల కోసం కదా!  
పరిపాలన విధానం,సమానత్వం కోసం కదా!  
కులం,మతం మాత్రమే రాజకీయాల్లో రాణిస్తుందా!  
ఆనాధలు,అభగ్యులు ఈ దేశ పౌరులు కారా!  
స్వేచ్ఛ,సమానత్వం కోరుకునే స్వాతంత్రం ఇప్పటికి పేద ప్రజలకు రాలేదనే  
సందేహం ప్రతి ఒక్కరికి కలుగుతుంది,పల్చన అవుతున్నా  
ఈ ప్రజాసౌమ్యంలో...

**పెద్దపల్లి రాజన్న...**  
Cell :9848174314

## రేవంత్ రెడ్డి చరిత్రహీనుడిగా మిగిలిపోతారు: కేటీఆర్

పేదల భూములను అరాచకంగా లాక్కుంటున్నారన్న కేటీఆర్

అధికారం ఎవరికీ శాశ్వతం కాదని వ్యాఖ్య

ఫోర్త్ సిటీ, ఫ్యూచర్ సిటీ పేరుతో భూ దందాకు తెరలేపారని మండిపాటు



2

## బీసీ మహిళల ఉప కోటా కోసం

# ఢిల్లీని గడగడలాడిస్తాం

చట్టసభల్లో బీసీ మహిళలకు ఉప కోటా సాధించేంత వరకు విశ్రమించేది లేదన్న కవిత

మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలు స్థానం కల్పించకపోవడం లేదంటూ కేంద్రంపై ఫైర్

తాను ఢిల్లీకి వెళ్లి వివిధ పార్టీల నేతలను కలుస్తానని వెల్లడి

మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాల స్ఫూర్తితో చట్టసభల్లో బీసీ మహిళలకు ఉప కోటా సాధించే వరకు విశ్రమించే ప్రసక్తే లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. పూలే జయంతి వేడుకల సందర్భంగా బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న ఆమె, మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు స్థానం కల్పించకపోవడంపై కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు.



2

## జీవన్ రెడ్డి నిర్ణయం

# సరికాదు...

పునరాలోచించుకోవాలి: మహేశ్ కుమార్ గౌడ్

బీఆర్ఎస్‌లో చేరాలనే జీవన్ రెడ్డి నిర్ణయాన్ని తప్పుపట్టిన మహేశ్ గౌడ్

కేసీఆర్ అవినీతిపై పోరాడిన జీవన్ రెడ్డి నిర్ణయం చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని వ్యాఖ్య

ఇప్పటికీ ఆయనపై తమకు గౌరవం ఉందన్న మహేశ్ గౌడ్



2

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
ఆదివారం
12 ఏప్రిల్ 2026

# రేవంత్ రెడ్డి చరిత్రహీనుడిగా మిగిలిపోతారు: కేటీఆర్

తెలంగాణ సమాజాన్ని మోసం చేస్తూ, తన కుటుంబ సభ్యులు, అనుచరుల కోసం పేద ప్రజల భూములను అరాచకంగా లాక్కుంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర చరిత్రలో ఒక చరిత్రహీనుడిగా మిగిలిపోతారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు త్వరలోనే బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు. ఇబ్రహీంపట్నంలో నిర్వహించిన బీఆర్ఎస్ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న కేటీఆర్... ఇబ్రహీంపట్నం, క్యాతనపల్లి మున్సిపాలిటీల్లో గులాబీ జెండా ఎగరడం న్యాయానికి దక్కిన విజయమని పేర్కొన్నారు. మెజారిటీ కౌన్సిలర్లు బీఆర్ఎస్ వైపు ఉన్నప్పటికీ, అక్రమంగా చైర్మన్ పదవులను దక్కించుకోవాలని కాంగ్రెస్ చేసిన ప్రయత్నాలు సాగలేదని అన్నారు.ముఖ్యంగా 'ఫోర్త్ సిటీ', 'ఫ్యూచర్ సిటీ' పేరుతో రేవంత్ రెడ్డి భారీ భూ దందాకు తెరలేపారని కేటీఆర్ ఆరోపించారు. ఎన్నికలకు ముందు ఫార్మా సిటీ భూములను రైతులకు తిరిగి ఇచ్చేస్తామని నమ్మబలికి ఓట్లు వేయించుకున్న కాంగ్రెస్ నేతలు, ఇప్పుడు అదే భూముల్లో కొత్త నగరాల పేరుతో నాటకాలు ఆడుతున్నారని మండిపడ్డారు. భట్టి విక్రమార్క, సీతక్క వంటి నేతలు పాదయాత్రలు చేసి ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి, ఇప్పుడు అదనంగా మరో 16,000 ఎకరాలను సేకరించాలని చూడటం వెనుక రేవంత్ రెడ్డి సోదరులు, అనుచరుల ఆర్థిక ప్రయోజనాలు ఉన్నాయని విమర్శించారు. ఉన్న సిటీలో దోమల నివారణ కూడా చేయలేని ప్రభుత్వం, ఫ్యూచరే లేని నాయకుడు ఫ్యూచర్ సిటీ కడతామంటే ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారుఇక నిషేధిత భూముల జాబితాను (22ఏ) అడ్డం పెట్టుకుని రాష్ట్రంలో పెద్ద ఎత్తున సెటిల్మెంట్లు జరుగుతున్నాయని కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 16 లక్షల ఎకరాలుగా ఉన్న నిషేధిత భూముల సంఖ్యను ఏకంగా కోటి ఎకరాలకు పెంచి, భూ యజమానులను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని మండిపడ్డారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ పెద్దలు కలెక్టర్లకు ఫోన్లు చేస్తూ భూ దందాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇబ్రహీంపట్నంలో స్థానిక ఎమ్మెల్యే అరాచకాలు పెచ్చుమీరాయని, హోటళ్లు, బార్ల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారని విమర్శించారు. అక్రమ కేసులకు భయపడకుండా నిలబడిన కార్యకర్తలకు అండగా ఉంటామని, నిబంధనలు అతిక్రమించి కాంగ్రెస్‌కు వత్తాసు పలికే అధికారులను భవిష్యత్తులో వదిలిపెట్టే ప్రసక్తి లేదని కేటీఆర్ స్పష్టం చేశారు

# బీసీ మహిళల ఉప కోటా కోసం ఢిల్లీని గడగడలాడిస్తాం:

మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాల స్ఫూర్తితో చట్టసభల్లో బీసీ మహిళలకు ఉప కోటా సాధించే వరకు విశ్రమించే ప్రసక్తే లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. పూలే జయంతి వేడుకల సందర్భంగా బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న ఆమె, మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు స్థానం కల్పించకపోవడంపై కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. బీసీ మహిళలకు ఉప కోటా ఇవ్వకపోవడం అంటే పాలకులకు ఆ వర్గాల పట్ల గౌరవం లేదని అర్థమని, కేంద్రం వెన్నులో వణుకు పుట్టేలా మరోసారి పూలే పుట్టారా అన్నట్లుగా జాగృతి ఆధ్వర్యంలో ఉద్ధృత పోరాటం చేస్తామని ఆమె హెచ్చరించారు. పార్లమెంట్‌లో ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు మహిళా బిల్లుపై జరగనున్న చర్చా సమయంలో తాను స్వయంగా ఢిల్లీకి వెళ్లి వివిధ రాజకీయ పార్టీల నేతలను కలుస్తానని కవిత వెల్లడించారు. కేవలం మెజారిటీ ఉందన్న అహంకారంతో బీసీలకు అన్యాయం చేస్తూ బిల్లును ఆమోదిస్తే ఊరుకునేది లేదని తేల్చిచెప్పారు. మరోవైపు రాష్ట్రంలో పూలే విగ్రహ ఏర్పాటు విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న జాప్యాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. అసెంబ్లీ ప్రాంగణంలో పూలే విగ్రహం పెట్టాలని డిమాండ్ చేస్తే... ట్యాంక్ బండ్ వద్ద పెడతామని చెప్పి, ఇప్పటికీ పనులు పూర్తి చేయలేదని మండిపడ్డారు. కనీసం అంబేద్కర్ జయంతి నాటికైనా ఆ పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఆర్టిజన్ల సమస్యలపై కూడా కవిత ఈ సందర్భంగా గళమెత్తారు. వారి క్రమబద్ధీకరణ కోసం జరుగుతున్న పోరాటానికి జాగృతి పూర్తి మద్దతు ఇస్తుందని, కొత్తగూడెంలో జరుగుతున్న ఆందోళనల్లో తమ నాయకులు పాల్గొంటారని ప్రకటించారు. గతంలో ఆర్టిజన్ల వేతనాలు పెంచడంలో జాగృతి కీలక పాత్ర పోషించిందని గుర్తు చేస్తూ, ఇప్పుడు వారిపై ప్రభుత్వం చర్యలకు దిగాలని చూడటం సరికాదన్నారు. పూలే చూపిన సామాజిక న్యాయం బాటలో నడుస్తూ అణగారిన వర్గాల హక్కుల కోసం అహర్నిశలు శ్రమించడమే ఆయనకు ఇచ్చే అసలైన నివాళి అని ఆమె కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

# 'బ్రహ్మోస్'పై ఆసక్తి చూపిస్తున్న ఆగ్నేయాసియా దేశాలు...

ఇండో-పసిఫిక్ ప్రాంతంలో మారుతున్న భౌగోళిక, రాజకీయ సమీకరణాల నేపథ్యంలో భారత్ ప్రాధాన్యత అంతకంతకూ పెరుగుతోంది. ముఖ్యంగా, దక్షిణ చైనా సముద్రంలో చైనా దూకుడును ఎదుర్కొనేందుకు ఆగ్నేయాసియా దేశాలు భారత్ వైపు ఆశగా చూస్తున్నాయి. ఇందులో భాగంగా, భారత్-రష్యా సంయుక్తంగా అభివృద్ధి చేసిన బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణిని సమకూర్చుకోవడంపై అమిత ఆసక్తి కనబరుస్తున్నాయి. ఫిలిప్పీన్స్ తర్వాత తాజాగా ఇండోనేషియా కూడా బ్రహ్మోస్ క్షిపణుల కొనుగోలుకు నిర్ణయం తీసుకోవడమే దీనికి నిదర్శనం.భారత్... ఆగ్నేయాసియాను బ్రహ్మోస్ క్షిపణికి కీలక మార్కెట్‌గా పరిగణిస్తోంది. శబ్దం కంటే వేగంగా (మాక్ 2.8 నుంచి 3 మధ్య వేగంతో) ప్రయాణించే ఈ క్షిపణి, తన కచ్చితత్వంతో లక్ష్యాలను ఛేదించగలదు. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఇది నిరూపితమైంది. సుమారు 400 కిలోమీటర్ల పరిధి కలిగిన బ్రహ్మోస్‌ను భూమి, సముద్రం, గాలి, జలాంతర్గాముల వివిధ ఉపరితలాల నుంచి ప్రయోగించవచ్చు. ఈ ప్రత్యేకతల కారణంగా, చైనా నౌకాదళ దూకుడును నిలువరించేందుకు ఇది సరైన ఆయుధమని ఆగ్నేయాసియా దేశాలు భావిస్తున్నాయి. ఈ మేరకు 'ఇండియా నరేటివ్' తన కథనంలో వివరాలను వెల్లడించింది.ఇండియా నరేటివ్ నివేదిక ప్రకారం, దక్షిణ చైనా సముద్ర తీర దేశాలైన వియత్నాం, ఫిలిప్పీన్స్, ఇండోనేషియా వంటివి తమ నిరోధక సామర్థ్యాలను (ాత్అ-ాాఎివం/ాతీము ణవఅఖ్యశ్రీ - ాా2/ాణ) పెంచుకోవడంపై దృష్టి సారించాయి. చైనా ఇప్పటికే శక్తివంతమైన ాా2/ాణ వ్యవస్థలను అభివృద్ధి చేయగా, బ్రహ్మోస్ వంటి క్షిపణులతో చిన్న దేశాలు కూడా అదే తరహా వ్యూహాన్ని అనుసరించి తమ సముద్ర జలాలను కాపాడుకోగలవని నివేదిక పేర్కొంది.ఇదే సమయంలో, పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల కారణంగా అమెరికా తన క్షిపణి, నౌకాదళ వనరులను ఇండో-పసిఫిక్ నుంచి తరలిస్తోంది. దీంతో చైనా దూకుడును ఎదుర్కోవడంలో అమెరికా ఇచ్చే భద్రతా హామీలపై ఆగ్నేయాసియా దేశాల్లో అపనమ్మకం పెరుగుతోంది. అమెరికా 2025 జాతీయ భద్రతా వ్యూహంలో కూడా ఈ ప్రాంతానికి ప్రాధాన్యత తగ్గించడం వారి ఆందోళనలను మరింత పెంచింది. ఈ నేపథ్యంలో, తమ సైనిక సామర్థ్యాన్ని పెంచుకునేందుకు ఆగ్నేయాసియా దేశాలు భారత్, జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాలతో భాగస్వామ్యాలను విస్తరించుకుంటున్నాయి. భారత్ ఇప్పటికే 2024లో ఫిలిప్పీన్స్‌కు బ్రహ్మోస్ క్షిపణులను అందించింది. ఇప్పుడు ఇండోనేషియాతో ఒప్పందం కుదుర్చుకుంది. వియత్నాంతో దాదాపు 700 మిలియన్ డాలర్ల ఒప్పందానికి కూడా చేరువలో ఉంది. ఈ పరిణామాలు కేవలం ఆయుధ విక్రయాలుగానే కాకుండా, విస్తృత ఇండో-పసిఫిక్ భూ-వ్యూహాత్మక క్షేత్రంలో భారత్ పోషిస్తున్న కీలక పాత్రకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

## శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా ప్రతినిధులకు ఘనంగా సన్మానం

**పాములపాడు,**

ఈరోజు నంద్యాల పట్టణంలోని, ఎస్.ఎన్ ఫంక్షన్ హాల్‌లో మాజీ శాసనసభ్యులు శిల్పా చక్రపాణి రెడ్డి అధ్యక్షతన బండిఆత్మకూరు,మహానంది మండలాల రాష్ట్రస్థాయి డైరెక్టర్లు, సర్పంచ్‌లకు,వార్డు మెంబర్లకు, సింగల్ విండో చైర్మన్లకు సన్మాన కార్యక్రమం జరిగింది. ప్రజా ప్రతినిధుల పదవీ కాలం పూర్తయిన సందర్భంగా, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన బండిఆత్మకూరు, మహానంది మండలాల ప్రజా ప్రతినిధులను శిల్పా చక్రపాణి రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శిల్పా చక్రపాణి రెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు ప్రజలకు సేవలందించడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు.భవిష్యత్‌లో కూడా పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.అనంతరం సన్మానితులైన సర్పంచ్‌లు,వార్డు సభ్యులు తమకు అందించిన గౌరవానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు శిల్పా భువనేశ్వర్ రెడ్డి మరియు మండల అధ్యక్షులు, వైఎస్ఆర్ సీపీ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## ఆదోనిలో వైసీపీ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు

**ఆదోని, డివిజన్ ఇంచార్జి -** మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆదోనిలో వైసీపీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు వై సాయి ప్రసాద్ రెడ్డి పాల్గొని పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్యోతిరావు పూలే భారతదేశంలో సామాజిక న్యాయం, సమానత్వం కోసం అహర్నిశలు కృషి చేసిన మహోన్నత వ్యక్తి అని పేర్కొన్నారు. సమాజంలోని వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. విద్య ద్వారానే సమాజాన్ని మార్చవచ్చని నమ్మిన పూలే గారు అణగారిన వర్గాలకు విద్య అందించేందుకు పాఠశాలలు స్థాపించారని గుర్తు చేశారు. ప్రత్యేకంగా బాలికల విద్యాభివృద్ధిపై ఆయన చూపిన కృషి విశేషమని, ఆ కాలంలో మహిళలకు విద్య అందించడం ఒక సవాల్ అయినప్పటికీ దానిని ధైర్యంగా ముందుకు తీసుకెళ్లారని వివరించారు. సమాజంలో ఉన్న అజ్ఞానం, మూఢనమ్మకాలపై పోరాడుతూ సమాన హక్కుల కోసం ఆయన నిరంతరం శ్రమించారని చెప్పారు. పూలే జయంతి సందర్భంగా ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టుకోవడం ద్వారానే నిజమైన నివాళి అర్పించినవారమవుతామని సాయి ప్రసాద్ రెడ్డి పిలుపునిచ్చారు.కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు, మాజీ చైర్మన్లు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ జెడ్‌పీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని పూలే సేవలను స్మరించుకున్నారు.

## కొత్త అవతారంలో విజయసాయిరెడ్డి..

ఈ డిజిటల్ వేదిక విజయవంతమైన తర్వాత అదే విలువలు, లక్ష్యాలతో తెలుగులో ఒక శాటిలైట్ న్యూస్ ఛానెల్‌ను కూడా ఏర్పాటు చేస్తామని వివరించారు. తాము స్థాపించబోయే మీడియా సంస్థ పూర్తిగా నిష్పక్షపాతంగా, వాస్తవాలకు కట్టుబడి ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు."మా మీడియా సంస్థ ఏ రాజకీయ పార్టీకి అనుబంధంగా ఉండదు. ఇది పూర్తిగా స్వతంత్రంగా పనిచేస్తుంది. సామాన్యులు, మహిళలు, యువత, రైతులు, కార్మికులు, అణగారిన వర్గాల సమస్యలను వెలుగులోకి తీసుకురావడమే మా ప్రధాన లక్ష్యం. వారి గొంతుకను వినిపిస్తాం" అని విజయసాయిరెడ్డి తన ట్వీట్‌లో పేర్కొన్నారు. తమ మీడియా సంస్థ పేరును త్వరలోనే ప్రకటిస్తానని ఆయన తెలిపారు.

## దారకొండలో మినీ ఆర్వో వాటర్ ప్లాంట్..

**సీలేరు**

జీకే వీధి మండలం,దారకొండ పంచాయతీ కేంద్రంలో మినీ ఆర్వో ప్లాంట్ ఉపాధ్యాయుడు మత్స్యరాజు ఏర్పాటు చేసారు.దారకొండలో ఇప్పటివరకు మినరల్ వాటర్ లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.పంచాయతీ ద్వారా వచ్చే కొళాయి నీళ్ళే గ్రామస్తులంతా త్రాగునీరుకు ఉపయోగిస్తున్నారు.త్రాగునీరు లేక కొత్తగా మైదాన ప్రాంతాలనుండి దారకొండ వచ్చిన ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.త్రాగునీటి సమస్యను గమనించిన ఉపాధ్యాయుడు మినీ ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి 20 లీటర్ల నీటిని రూ.30 కి విక్రయిస్తున్నారు.దీనిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

# అమీన్‌పూర్‌లో హైడ్రా అత్యంత భారీ ఆపరేషన్...

దీని మార్కెట్ విలువ రూ.15,000 కోట్లకు పైగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. భారీ పోలీస్ బందోబస్తు నడుమ ఈ భూమికి రక్షణగా ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు.ఈ ఆపరేషన్‌లో భాగంగా, భూకబ్జాదారుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎం.ఏ. ముఖీం నిర్మించిన అక్రమ కట్టడాలను అధికారులు పూర్తిగా నేలమట్టం చేశారు. ఇందులో 40 ఎకరాల్లో నిర్మించిన విలాసవంతమైన గెస్ట్ హౌస్, ఫామ్‌హౌస్‌తో పాటు, అతని సోదరుడు ఎం.ఏ. అజీం 2.20 ఎకరాల్లో కట్టిన 6 అంతస్తుల అపార్ట్‌మెంట్‌ను కూడా కూల్చివేశారు. స్విమ్మింగ్ పూల్, పశువుల పాకలు, గుర్రాల కోసం నిర్మించిన షెడ్లను సైతం తొలగించారు. అయితే, ఇప్పటికే ఇళ్లు నిర్మించుకున్న పేదలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికారులు మైకుల ద్వారా ప్రకటించడంతో స్థానిక ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ప్రభుత్వ చర్యతో, ఏళ్లుగా న్యాయపోరాటం చేస్తున్న పాత లేఅవుట్ల యజమానులు ఆనందం వ్యక్తం చేస్తూ బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు.

అమీన్‌పూర్ మండలం ఈలాపూర్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 1 నుంచి 220 వరకు ఉన్న 1,263 ఎకరాల భూమి నిజాం పాలకులకు చెందినదిగా రికార్డుల్లో ఉంది. విలీన ప్రక్రియ తర్వాత ఇది ప్రభుత్వ భూమిగా మారింది. ఈ భూమిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని 1998లోనే హైకోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చింది. అనంతరం 2003లో హైకోర్టు డివిజన్ బెంచ్ కూడా ఈ భూమి ప్రభుత్వానిదేనని తేల్చిచెప్పింది.అయినప్పటికీ, కోర్టు ఆదేశాలను ఏమాత్రం లెక్కచేయకుండా ముఖీం 2006లో ఇక్కడ భారీ నిర్మాణాలు చేపట్టారు. అంతేకాకుండా, స్థానిక ప్రజాప్రతినిధులతో సంబంధాలు కొనసాగిస్తూ ఈ భూమిలో ఇష్టానుసారంగా అమ్మకాలు జరుపుతూ వందల కోట్లు దండుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. చట్టాలను, అధికారులను లెక్కచేయకుండా సాగిస్తున్న ముఖీం అక్రమాలకు తాజా ఆపరేషన్‌తో ప్రభుత్వం అడ్డుకట్ట వేసింది. మొత్తం 1,263 ఎకరాల్లో ఇప్పటికే నిర్మాణాలు జరిగిన ప్రాంతాన్ని మినహాయించి, ఖాళీగా ఉన్న 861 ఎకరాల భూమిని పూర్తిగా తన అధీనంలోకి తీసుకుని ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది.

# మేడారం పనుల్లో అవినీతిపై సీబీఐ విచారణకు సిద్ధం

కాంగ్రెస్ అధికారంలోకి రావడాన్ని బీఆర్ఎస్ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని సీతక్క విమర్శించారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు బీఆర్ఎస్ నేతలు తనను ప్రలోభాలకు గురిచేయాలని చూసినా లొంగలేదని గుర్తుచేశారు. ఎన్నికల్లో తనను ఓడించడానికి వందల కోట్లు ఖర్చుపెట్టి తప్పుడు ప్రచారం చేశారని ఆరోపించారు.

రూ.30 కోట్ల కుంభకోణం జరిగిందన్న బీఆర్ఎస్

మరోవైపు, బీఆర్ఎస్ అధికార ప్రతినిధి మన్నె క్రిశాంక్ ఇటీవల మంత్రి సీతక్క శాఖలో భారీ కుంభకోణం జరిగిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ పథకమైన 'పోషణ్ అభియాన్' కింద 38,130 స్మార్ట్‌ఫోన్ల కొనుగోలుకు రూ.54.19 కోట్లతో టెండర్లు పిలిచారని తెలిపారు. టెండర్‌లో 5జీ ఫోన్లు అని పేర్కొని, 4జీ మోడల్ (శాంసంగ్ ఏ06) ఫోన్లను పంపిణీ చేశారని ఆరోపించారు. ఈ ఫోన్‌కు, ప్రభుత్వం టెండర్‌లో రూ.14,215 చెల్లించేలా ఒప్పందం చేసుకుందని విమర్శించారు. ఈ లెక్కన మొత్తం కొనుగోళ్ల విలువ రూ.24 కోట్లు మాత్రమే ఉండాల్సి ఉండగా, అదనంగా చెల్లించి సుమారు రూ.30 కోట్ల అవినీతికి పాల్పడ్డారని క్రిశాంక్ ఆరోపించారు. ఈ ఆరోపణలు, ప్రత్యారోపణలతో రాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి.

# జీవన్ రెడ్డి నిర్ణయం సరికాదు...

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరాలని తీసుకున్న నిర్ణయంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఘాటుగా స్పందించారు. దశాబ్దాల కాలంగా కాంగ్రెస్ జెండా మోసిన ఆయన, కేవలం స్థానికంగా ఉన్న చిన్నపాటి విభేదాల కారణంగా పార్టీని వీడటం సరైన నిర్ణయం కాదని హితవు పలికారు. దశాబ్దాల పాటు కేసీఆర్ కుటుంబ పాలన, అవినీతిపై అలుపెరగని పోరాటం చేసిన జీవన్ రెడ్డి, ఇప్పుడు అదే కేసీఆర్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకోవడానికి సిద్ధపడటం చూసి రాష్ట్ర ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఇలాంటి చర్యలు ఆయన రాజకీయ స్థాయికి తగవని, నవ్వుల పాలు కావద్దని సూచించారు.కాంగ్రెస్ పార్టీ జీవన్ రెడ్డికి ఎల్లప్పుడూ సముచిత గౌరవం ఇచ్చిందని, కీలక బాధ్యతలు అప్పగించిందని మహేశ్ కుమార్ గౌడ్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. వ్యక్తిగత అసంతృప్తి కంటే పార్టీ సిద్ధాంతాలే ముఖ్యమని, ఇన్నేళ్ల రాజకీయ అనుబంధాన్ని తెంచుకోవడం తనను ఆశ్చర్యానికి గురిచేసిందని పేర్కొన్నారు. పార్టీ వీడినప్పటికీ ఆయనపై తమకు వ్యక్తిగత గౌరవం ఉందని, అయితే ఇప్పటికైనా తన నిర్ణయంపై పునరాలోచించుకోవాలని ఆయన కోరారు. ఒకవేళ జీవన్ రెడ్డి తన మనసు మార్చుకుని వెనక్కి తగ్గితే అది ఆయన రాజకీయ భవిష్యత్తుకు, పార్టీకి మేలు చేస్తుందని అన్నారు. రాజకీయాల్లో ఆవేశం కంటే ఆలోచన ముఖ్యమని, ఆయన తప్పుడు దారిలో వెళుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు

# రైతు రుణమాఫీపై తప్పుడు ప్రచారం వద్దు:

గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన రైతు రుణమాఫీ కేవలం వడ్డీలకే సరిపోయిందని, తమ ప్రభుత్వం మాత్రం చిత్తశుద్ధితో రైతులకు లబ్ధి చేకూరుస్తోందని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ఆయన... రుణమాఫీ, రైతు భరోసా అంశాలపై మాజీ మంత్రి హరీశ్ రావు చేస్తున్న విమర్శలను తీవ్రంగా ఖండించారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 25 లక్షల మంది రైతులకు, ఒక్కొక్కరికి రూ. 2 లక్షల చొప్పున రుణమాఫీని విజయవంతంగా పూర్తి చేశామని ఆయన వివరించారు. సుమారు 40 బ్యాంకులు అందించిన డేటా ఆధారంగా అర్హులైన ప్రతి రైతుకూ ఈ ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకున్నామని తుమ్మల క్లారిటీ ఇచ్చారు.ఆర్థికంగా అనేక సవాళ్లు ఉన్నప్పటికీ రైతు సంక్షేమం కోసం తమ ప్రభుత్వం వెనకడుగు వేయలేదని మంత్రి గుర్తు చేశారు. గత ప్రభుత్వ హయాంలో రైతుబంధు నిధుల విడుదల కోసం రైతులు నెలల తరబడి వేచి చూడాల్సి వచ్చేదని, కానీ తమ ప్రభుత్వం కేవలం తొమ్మిది రోజుల వ్యవధిలోనే రూ. 9 వేల కోట్ల రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసి రికార్డు సృష్టించిందని తెలిపారు. రెండు పంటల కాలంలోనే రైతుల సంక్షేమం కోసం దాదాపు లక్ష కోట్ల రూపాయలు ఖర్చు చేసిన ఘనత తమకే దక్కుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రైతులకు ఈ స్థాయిలో మేలు చేస్తున్న ప్రభుత్వం దేశంలో ఎక్కడైనా ఉందేమో హరీశ్ రావు సమాధానం చెప్పాలని తుమ్మల సవాల్ విసిరారు. నిరాధారమైన ఆరోపణలతో రైతులను తప్పుదోవ పట్టించవద్దని ఆయన ప్రతిపక్ష నేతలకు హితవు పలికారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
ఆదివారం
12 ఏప్రిల్ 2026

## భక్తి వైభవంగా లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు, ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి





హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఏప్రిల్ 11:-
బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సెల్ఫ్ ఎస్.కె.డి.నగర్‌లో శ్రీశ్రీశ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి 14వ బ్రహ్మోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించబడ్డాయి. ఈ పుణ్యకార్యక్రమానికి ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. వేద మంత్రోచ్చారణల మధ్య జరిగిన పూజలు, హారతులు కార్యక్రమానికి ఆధ్యాత్మిక వాతావరణాన్ని అందించాయి. ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, ఇలాంటి ధార్మిక కార్యక్రమాలు సమాజంలో శాంతి, ఐక్యతను పెంపొందిస్తాయని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ భారస అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్ రెడ్డి, అనిల్ చౌదరి, పార్టీ సీనియర్ నాయకులు, ఉద్యమకారులు, కార్యకర్తలు, మహిళలు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు, కార్యవర్గ సభ్యులు, దేవాలయ కమిటీ సభ్యులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తుల సమక్షంలో నిర్వహించిన ఈ బ్రహ్మోత్సవాలు ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపడంతో పాటు, ప్రాంతీయ ప్రజల్లో భక్తి భావాన్ని మరింతగా పెంచాయి. నిర్వహణ కమిటీ సమర్థవంతమైన ఏర్పాట్లతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించగా, హాజరైన భక్తులు సంతృప్తిని వ్యక్తం చేశారు

## విజయవాడలో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి

విజయవాడ ఏప్రిల్ 11:-హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి విజయవాడ
విజయవాడ నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద ఉన్న మహనీయ సామాజిక సంస్కర్త జ్యోతిరావు పూలే గారి విగ్రహానికి పూలమాలలు వేసి రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్) నాయకులు ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పిట్టా వరప్రసాద్, రాష్ట్ర మైనార్టీ ముస్లిం విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మొహమ్మద్ అజీమ్, ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు బయ్యపునేని తిరుపతిరావు, యువజన విభాగం అధ్యక్షులు బి. వెంకట సూర్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, శూద్రులు, అతిశూద్రులు, మహిళల విద్యా హక్కుల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన పూలే గారి సేవలను స్మరించారు. కుల వివక్ష నిర్మూలన, సమానత్వ సమాజ నిర్మాణం కోసం పూలే చూపిన మార్గం నేటికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. పూలేఅంబేద్కర్ ఆలోచనలు సమాజ మార్పుకు శాశ్వత దిశానిర్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



## ఓరుగంటి సత్యం గౌడ్ పై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలి

### ఎమ్మార్పీఎస్ యాచారం మండల అధ్యక్షుడు మూలి మహేష్‌లి



హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి యాచారం
సోషల్ మీడియా లో పద్మ శ్రీ మంద కృష్ణ మాదిగ గారి పై వ్యక్తిగత దూషణ చేసిన మంచాల గ్రామానికి చెందిన ఓరుగంటి సత్యం గౌడ్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ యాచారం మండల అధ్యక్షుడు మూలి మహేష్ ఆధ్వర్యం లొ యాచారం మండల సీఐ నదీశ్వర్ రెడ్డి గారికి ఫిర్యాదు చేశాము ఈ కార్యక్రమం లొ యాచారం మండల అధికార ప్రతినిధి మస్కు యాదగిరి, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు చింతల సాయిలు , జోగు అంజయ్య,మస్కు యాదగిరి,మూలి జంగయ్యగ్, మాస్కు అశోక్,జోగు అనిల్ కుమార్.. తదితరులు పాల్గొనడ్డం జరిగింది ...

# రిజిస్టర్ వైద్యుని ప్రిస్క్రిప్షన్ లేకుండా యాంటీబయాటిక్ మందులు ఇవ్వోద్దు

## -అవగాహన సదస్సులో కెమిస్టులకు మత్తుపదార్థాల నియంత్రణ అధికారుల సూచన

హైదరాబాద్, ఏప్రిల్ 11: అలవాటుగా మారే మందులు, యాంటీబయాటిక్ మందులను రిజిస్టర్ వైద్యుని ప్రిస్క్రిప్షన్ పై మాత్రమే ఇవ్వాలని తెలంగాణ మత్తుపదార్థాల నియంత్రణ పరిపాలన సహాయ సంచాలకులు టి.రాజమౌళి కెమిస్టులకు (మెడికల్ షాపుల యజమానులు) సూచించారు. తెలంగాణ ప్రభుత్వం ఔషధ నియంత్రణ శాఖ, తెలంగాణ చాంబర్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం కింగ్ కోఠిలోని కెమిస్ట్ భవన్ లో మాదక ద్రవ్యాల నియంత్రణ మరియు నియంత్రణ బలోపేత దినోత్సవం పై ప్రజా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అబిడ్స్ తాజ్ మహల్ హోటల్ నుంచి కెమిస్ట్ భవన్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో 'ప్రిస్క్రిప్షన్ లేదు మందులు వద్దు', 'మందుల దుర్వినియోగాన్ని ఆపండి', 'అలవాటుగా మారే మందులు వద్దు అని చెప్పండి' వంటి నినాదాలతో ప్లైకార్డులను ప్రదర్శించారు. కార్యక్రమంలో డ్రగ్ ఇన్స్పెక్టర్స్ వి.అజయ్, బి.లక్ష్మి, ఇ. తిరుపతి, జె. అశ్విన్ కుమార్, ఈగిల్ ఫోర్స్ అధికారులు మాట్లాడుతూ.. ట్రామడోల్, ఆల్ప్రజోలామ్, మెఫెంటర్మైన్ ఇంజెక్షన్ వంటి అలవాటుగా మారే మందుల దుర్వినియోగం వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. నకిలి మందులపై అధికారులకు హెల్ప్ లైన్ ద్వారా ఫిర్యాదు చేయడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తెలంగాణ చాంబర్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అధ్యక్షులు డాక్టర్ ఘిసులాల్, సలహా కమిటీ చైర్మన్



ఎం.సూర్యప్రకాష్, సంజయ్ మోడి, సిహెచ్ ఆనంద్ కుమార్ గౌడ్, నవనీత్ అగర్వాల్, సుధీర్గుప్తా, అరవింద్ కుమార్ భంగడియా, వినయ్ కనోడియా, సంజయ్ కుమార్ జైన్, మనీష్ కుమార్ అగర్వాల్, నవీన్ కుమార్ జైస్వాల్, మాణిక్ చంద్ గుప్తా, వై. అరవింద్ కుమార్, అరవింద్ కుమార్ అగర్వాల్, తదితరులు పాల్గొన్నారు.

# మంచిరెడ్డి కిషన్ రెడ్డి జన్మదిన వేడుకల్లో కేటీఆర్

## మంచి రెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి ని అభినందించిన కల్వకుంట్ల తారక రామారావు



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఏప్రిల్ 11:-
ఇబ్రహీంపట్నం నియోజకవర్గం. మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి జన్మదినం సందర్భంగా, అలాగే మున్సిపాలిటీ చైర్మన్, కౌన్సిలర్ల గెలుపు నేపథ్యంలో శనివారం రోజున ప్రమిద గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో భారత రాష్ట్ర సమితి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంచిరెడ్డి కిషన్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన కేటీఆర్, మున్సిపాలిటీ నూతన చైర్మన్ టేకుల సుదర్శన్ రెడ్డి, కౌన్సిలర్లకు అభినందనలు తెలిపారు. అనంతరం సభను ఉద్దేశించి మాట్లాడిన ఆయన, ప్రస్తుత ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి పనితీరుపై తీవ్ర విమర్శలు గుప్పించారు. నియోజకవర్గ అభివృద్ధి విషయంలో ఎమ్మెల్యే పూర్తిగా విఫలమయ్యారని, ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో నిర్లక్ష్యం చూపుతున్నారని ఆరోపించారు. స్థానిక సమస్యలను పరిష్కరించడంలో కూడా సరైన చొరవ తీసుకోలేకపోయారని విమర్శించారు. ఇక రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలు అమలులో విఫలమయ్యాయని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రజలను ఆకర్షించేందుకు ఇచ్చిన హామీలు ఆచరణలో కనిపించడం లేదని, ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని అన్నారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు పాలనలో జరిగిన అభివృద్ధి పనులను కేటీఆర్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో ముందంజలో నిలిచిందని తెలిపారు. రైతులకు రైతు బంధు, రైతు బీమా వంటి పథకాల ద్వారా భరోసా కల్పించారని, 24 గంటల ఉచిత విద్యుత్‌తో వ్యవసాయ రంగం బలోపేతం అయ్యిందని గుర్తు చేశారు. మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి తాగునీరు అందించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని, మిషన్ కాకతీయతో చెరువుల పునరుద్ధరణ జరిగిందని పేర్కొన్నారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాల ద్వారా పేద కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించారని తెలిపారు. ఆసరా పింఛన్ల ద్వారా వృద్ధులు, దివ్యాంగులు, ఇతర బలహీన వర్గాలకు సంక్షేమాన్ని



అందించారని వివరించారు.
బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన ఈ పథకాలు ప్రజల జీవితాల్లో గణనీయమైన మార్పు తీసుకువచ్చాయని, అదే అభివృద్ధి మోడల్‌ను మళ్లీ తీసుకురావాలని ప్రజలు కోరుకుంటున్నారని కేటీఆర్ అన్నారు. మరో రెండున్నర సంవత్సరాల్లో బీఆర్ఎస్ పార్టీ తిరిగి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.
కార్యకర్తలు ఐక్యంగా పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, ప్రజల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సబిత ఇంద్రారెడ్డి, క్యామ మల్లేష్ , మాజీ గ్రంథాలయ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మంచి రెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి, ఇబ్రహీంపట్నం నియోజకవర్గస్థాయి ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఘనంగా జ్యోతిబాపూలే 199వ జయంతి వేడుకలు

## -ముఖ్య అతిథిగా రామగుండం కార్పొరేషన్ మేయర్ మహంకాళి స్వామి

పెద్దపల్లి
గోదావరిఖనిలో మహాత్మ జ్యోతిబా పూలే విగ్రహం వద్ద జ్యోతిబాపూలే 199 వ జయంతి వేడుకలు వైభవంగా రామగుండం కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్వాగత ఉపన్యాసం ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ కమిటీ ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కవ్వంపల్లి సతీష్ చెప్పగా సభ అధ్యక్షత కోదండ రామాలయ కమిటీ చైర్మన్ కార్పొరేటర్ బీసీ సంఘాల నాయకులు గట్ల రమేష్ వహించారు ముఖ్య అతిథిగా విచ్చేసిన రామగుండం కార్పొరేషన్ మేయర్ మహంకాళి స్వామి, మక్కాన్ సింగ్ సేవాసమితి చైర్మన్ మనాలి ఠాగూర్ జ్యోతిబాపూలే విగ్రహానికి పూలమాలలు వేసి కేక్ కటింగ్ చేశారు కార్యక్రమంలో అతిథులుగా కార్పొరేటర్లు దూళికట్ట సతీష్, దాసరి సాంబమూర్తి, బాలసాని తిరుపతి గౌడ్, వెంగళ బాబు, బాబుమియా, కౌటం సతీష్, కొమ్ము వేణు,నాగరాజు, ముస్తఫా, వివిధ రాజకీయ కుల సంఘాల నాయకులు కందుల సంధ్యారాణి, కాలువ లింగస్వామి,తిప్పారపు శ్రీనివాస్,సిఐటియు రాజిరెడ్డి, గొర్రె రమేష్, కొంకటి లక్ష్మణ్, మైస రాజేష్, కోటగిరి పాపయ్య, తోడేటి శంకర్ గౌడ్, కలువల రంజిత్ పర్లపెల్లి బాబు, డేవిడ్, కనుకుంట్ల సమ్మయ్య, గడ్డం తిరుపతి తదితరులు పాల్గొని మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే బడుగు బలహీన వర్గాల కోసం అనేక రకాల కృషి చేశారని వారు 1827 ఏప్రిల్ 11న జన్మించి వారు మరణించేంత వరకు కూడా ప్రజల బంగారు భవిష్యత్తు కోసం క్రుషి చేశారని అనేక విద్యాలయాలు స్థాపించారని తన భార్య సావిత్రి బాయ్ పులే కు విద్య నేర్పించి మహిళలందరును విజయవంతంలు



కావాలని కోరుకున్నారని మొట్టమొదటి సారిగా తన భార్యతో కలిసి 1848 లో విద్యాలయం స్థాపించారని బొంబాయిలో మహాత్మ జ్యోతిబాపూలేకు ప్రజలే మహాత్మ అనే బిరుదును అందించారని ప్రజల నాయకునిగా సంఘసంస్కర్త గా ప్రజల హృదయాల్లో నిలిచి పోయారని ఆ మహాను భావులను ఆదర్శంగా తీసుకోవాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం నాయకులు గద్దెల శశి భూషణ్, పెగడపల్లి నారాయణ, బూడిద మహేందర్, పంజా అశోక్, పుల్లూరి మహేందర్, బోట్ల స్వామి, జిల్లాల శ్రీనివాస్, దొమ్మడి శేఖర్,గొర్రె నర్సింగ రావు, బూడిద సమ్మయ్య, సురేష్, చిరంజీవి, వివిధ రాజకీయ పార్టీల కుల సంఘాల నాయకులు నిమ్మకాయలు ఏడుకొండలు, శేఖర్, కరీం, తోకల ప్రశాంత్, భరత్, గఫర్ , భూషణ్ గౌడ్, విజయ్ అధిక సంఖ్యలో ప్రజలు నాయకులు పాల్గొన్నారు.

RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
ఆదివారం
12 ఏప్రిల్ 2026

# జ్యోతి రావు పూలేకి ప్రజలు ఇచ్చిన బిరుదు మహాత్మ

**-సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారీ**



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఏప్రిల్ 11
సామజిక సంఘ సంస్కార్త జ్యోతి రావు పూలే కి ప్రజలే మహాత్మ అనే బిరుదు ఇచ్చారాని భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ)రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారీ అన్నారు. అంటరాని తనం కుల వ్యవస్థ రద్దు కోసం తన జీవితమంతా పోరాటం చేసిన మహాత్మ జ్యోతి రావు పూలే జయంతి సందర్భంగా శనివారం నాడు సిపిఐ అబ్దుల్లాపూర్ మెట్ మండల సమితి ఆధ్వర్యంలో రావి నారాయణ రెడ్డి కాలనీ ఫెజ్ 2 సిపిఐ కార్యాలయంలో లో మండల కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్ అధ్యక్షతన జరిగిన నివాళి కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారీ మరియు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి గార్లు హాజరై ప్రశాంగించారు.మహిళల సాధికారత కొరకు మహిళా అభివృద్ధి కొరకు స్త్రీ పురుష సమానత్వం కొరకు నిరంతరం పోరాడి తన భార్య సావిత్రి భాయి పూలే ని దేశంలో లోనే మొట్ట మొదటి మహిళా ఉపాధ్యాయురాలిని చేసిన గొప్ప వ్యక్తి జ్యోతి రావు పూలే అని అన్నారు.బ్రాహ్మనియ ఆధిపత్య భావజాలంని వ్యతిరేకించి సమానత్వం కోసం పోరాడిన జ్యోతిరావు పూలే ఆశయాల సాధనకు స్త్రీ పురుష సమానత్వం కోసం ఆధిపత్య భావజాలం రద్దు కొరకు నిరంతరం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్, నాయకులు అరుణ, శేఖర్, పొన్నాల యాదగిరి, నర్సింహా,యాదగిరి,మధు, వినోద్ నాయక్, ఈశ్వరయ్య,నిరంజన్, సైదులు ముదిరాజ్, యాదగిరి, ఆటో రాములు,చిర్రా కవిత,సుజాత,



వీరేష్, కొత్తూరు సుభద్ర, మహేందర్,అచ్చు నారాయణ, కారంపూడి వెంకటయ్య, అశోక్, కురుమయ్య,మరియు తదితరులు పాల్గొన్నారు

# శ్రీదత్త విద్యాసంస్థల్లో ఘనంగా ‘ఇన్ఫినిటీ 2026’ ప్రారంభం

**విద్యార్థుల ప్రతిభకు వేదికగా ‘ఇన్ఫినిటీ 2026’ కార్యక్రమం ప్రారంభం**



హైదరాబాద్ స్టేట్ ప్రతినిధి ఏప్రిల్ 11:-
రంగారెడ్డి జిల్లా పరిధిలోని శ్రీదత్త విద్యాసంస్థల్లో విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించే ఉద్దేశంతో “ఇన్ఫినిటీ 2026” కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జి. పాండురంగ రెడ్డి, వైస్ చైర్మన్ రామకృష్ణ , జీఎన్వి డైరెక్టర్ దేవేందర్, హాజరై విద్యార్థులను ఉత్సాహపరిచారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా సృజనాత్మకతను పెంపొందించుకోవాలని సూచించారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.ఇన్ఫినిటీ 2026లో భాగంగా వివిధ సాంకేతిక మరియు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ముఖ్యంగా హ్యాకథాన్, కోడింగ్ పోటీలు, టెక్నికల్ ప్రాజెక్ట్ ప్రదర్శనలు వంటి కార్యక్రమాలు విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగడానికి అవసరమైన నైపుణ్యాలను సాధించగలరని ఆశాభావం వ్యక్తం చేశారు.

# గురు నానక్ విద్యాసంస్థల 25వ వార్షికోత్సవ వేడుకలు

**-విద్యా సేవలో పావు శతాబ్దం, గురు నానక్ సంస్థల రజతోత్సవ వేడుకలు ఘనంగా**

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఏప్రిల్ 11:-
హైదరాబాద్ పరిసర ప్రాంతమైన ఇబ్రహీంపట్నం సమీపంలో ఉన్న గురు నానక్ విద్యాసంస్థలు తమ స్థాపనకు 25 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా రజతోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా సంస్థల నూతన ప్రతీకను ఆవిష్కరించారు.
ఈ విద్యాసంస్థలు గురు నానక్ విద్యాసంఘం ఆధ్వర్యంలో స్థాపించబడినవిగా, గురు నానక్ సాంకేతిక కళాశాల, గురు నానక్ ఇంజినీరింగ్ కళాశాల మరియు గురు నానక్ విశ్వవిద్యాలయం ద్వారా విద్యా సేవలను అందిస్తున్నాయి. వేడుకల ప్రారంభంలో సంస్థ స్థాపకులు, దూరదృష్టి కలిగిన నాయకులు అయిన స్వర్గీయ సర్దార్ తవీందర్ సింగ్ కోహ్లీకి ఘన నివాళులు అర్పించారు. ఆయన చూపిన మార్గదర్శకత్వం వల్లే ఈ సంస్థలు వేలాది మంది విద్యార్థులకు విద్యను అందిస్తూ అభివృద్ధి సాధిస్తున్నాయని వక్తలు కొనియాడారు. ప్రతిభ గల విద్యార్థులకు ప్రతి సంవత్సరం పురస్కారాలు అందించడం ద్వారా ఆయన సేవలను స్మరించుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రముఖులు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూనే, ఉన్నత విద్యలో ముందుకు



వెళ్లాలంటే పరిశోధన దిశగా కృషి చేయాలని సూచించారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ప్రోత్సహించారు.
సంస్థల నిర్వహణ వర్గానికి చెందిన ప్రతినిధులు మాట్లాడుతూ, గత కాలంలో విద్యార్థులు ఉద్యోగ అవకాశాల్లో మంచి ఫలితాలు సాధించారని తెలిపారు. అనేక ప్రముఖ సంస్థలలో ఉద్యోగ అవకాశాలు లభించడంతో విద్యార్థులు తమ ప్రతిభను నిరూపించుకున్నారని పేర్కొన్నారు.
అదేవిధంగా, విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకొని కొత్త ఆవిష్కరణల వైపు దృష్టి పెట్టాలని సూచించారు. విద్యాసంస్థలు ఈ దిశగా పూర్తి మద్దతు అందిస్తాయని తెలిపారు. సమాజానికి



ఉపయోగపడే విధంగా తమ జ్ఞానాన్ని వినియోగించాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు.
ఈ సందర్భంగా విద్యాసంస్థల వార్షిక నివేదికలను అధికారులు సమర్పించి, గత ఏడాది సాధించిన పురోగతిని వివరించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, అధ్యాపకులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. వేడుకల భాగంగా అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు, ఉత్తమ బోధన అందించిన అధ్యాపకులు మరియు విశిష్ట సేవలందించిన సిబ్బందిని సన్మానిస్తూ పురస్కారాలు అందజేశారు.

# సురక్షిత ఔషధ వినియోగమే లక్ష్యం“

**డి ఎం హెచ్ ఓ“ లలితా దేవి-డ్రగ్ నియంత్రణలో కఠిన చర్యలు, ప్రజల్లో అవగాహన పెంపు కీలకం**



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఏప్రిల్ 11:-
ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న హెల్త్ వీక్ కార్యక్రమాలలో 6వ రోజును “డ్రగ్స్ కంట్రోల్ మరియు రెగ్యులేటరీ స్ట్రెంగ్తెనింగ్ డే”గా జిల్లా ఆసుపత్రి కొండాపూర్‌లో నిర్వహించారు.జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. కె. లలిత దేవి, ప్రోగ్రామ్ ఆఫీసర్లు, డిప్యూటీ డి ఎం హెచ్ ఓ ఎస్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మెడికల్, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో, డ్రగ్ కంట్రోల్ అథారిటీ మరియు ఈగిల్ ఫోర్స్ తెలంగాణ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి.ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించి డ్రగ్ దుర్వినియోగం నివారణ, సురక్షిత ఔషధాల వినియోగంపై ప్రజలకు సందేశం అందించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం ద్వారా ప్రజారోగ్య పరిరక్షణకు తమ కట్టుబాటును తెలియజేశారు.డ్రగ్ కంట్రోల్ అథారిటీ, ఈగిల్ టీమ్ ప్రతినిధులు అవగాహన పోస్టర్లను ఆవిష్కరించి డ్రగ్ దుర్వినియోగం వల్ల కలిగే ప్రమాదాలపై వివరించారు.అలాగే విద్యార్థుల కోసం నిర్వహించిన క్విజ్, వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. యువతలో అవగాహన పెంపొందించడంలో ఈ కార్యక్రమాలు కీలకంగా నిలిచాయి.సభలో మాట్లాడిన అధికారులు డ్రగ్ నియంత్రణలో కఠిన చర్యలు, విభాగాల మధ్య సమన్వయం అవసరాన్ని వివరించారు.కార్యక్రమం అనంతరన డి ఎం హెచ్ ఓ ఆసుపత్రి రిక్రియేషన్ సెంటర్‌ను సందర్శించి రంగోలి కార్యక్రమాన్ని ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది పాల్గొని డ్రగ్ నియంత్రణపై తమ కట్టుబాటును తెలియజేశారు.



# మందమర్రి ఏరియాలో ఘనంగా మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి వేడుకలు



హైదరాబాద్ ఎస్టేట్ మంచిర్యాల
మంచిర్యాల జిల్లా మందమర్రి ఏరియాలోని సీఈఆర్ క్లబ్‌లో మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి వేడుకలను శనివారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్.రాధాకృష్ణ హాజరై, పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు మందమర్రి ఏరియా డీజీఎం (పర్సనల్) సిహెచ్. అశోక్ అధ్యక్షత వహించారు. జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ మాట్లాడుతూ, సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి, మహిళా విద్యకు పూలే చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమ కన్వీనర్ జి.ఎల్. ప్రసాద్ మాట్లాడుతూ. సామాజిక సమానత్వం కోసం పూలే పడ్డ తపనను వివరించారు. బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు మరియు ఏఐటీయూసీ ప్రతినిధులు మాట్లాడుతూ, పూలే దంపతులు విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో అతిథులుగా మరియు వక్తలుగా పలువురు అధికారులు, కార్మిక సంఘాల నాయకులు జి.ఎల్. ప్రసాద్: ఎస్.ఓ. టు జీఎం (కార్యక్రమ కన్వీనర్) మహమ్మద్ అక్బర్ అలీ ఏఐటీయూసీ రామకృష్ణాపూర్ బ్రాంచ్ సెక్రటరి ఎస్. రమేష్: సీఎంఓఏఐ ప్రెసిడెంట్, మందమర్రి బాలాజీ భగవతి ఝా: ఏరియా ఇంజనీర్, మందమర్రి ఎస్. శ్రీధర్: ఎస్.ఈ. (సివిల్), మందమర్రి, మహమ్మద్ ముస్తఫా అడిషనల్ మేనేజర్, బీసీ ఎంప్లాయీస్ లైజన్ ఆఫీసర్ పి. రాజు అడిషనల్ మేనేజర్, బీసీ ఎంప్లాయీస్ వైస్ ప్రెసిడెంట్ పి. శ్రీధర్ గౌడ్: అడిషనల్ మేనేజర్, బీ.సీ ఎంప్లాయీస్ ఏరియా సెక్రటరీ పెద్ద సంఖ్యలో అధికారులు, ఉద్యోగులు మరియు బీ.సీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి నాయకత్వంలో అభివృద్ధి దూసుకెళ్తోంది

**13 కోట్లతో రోడ్ల నిర్మాణం ఇబ్రహీంపట్నం మారుతోంది**

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఏప్రిల్ 11:-
ఇబ్రహీంపట్నం నియోజకవర్గం శుక్రవారం రోజున: అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు సాగుతోంది. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మౌలిక వసతుల పెంపుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్న ఎమ్మెల్య మల్ రెడ్డి రంగారెడ్డి, నాయకత్వంలో ప్రాంతం రూపురేఖలు మారుతున్నాయి జిహెచ్ఎంసి పరిధిలోని 52వ డివిజన్ పెద్ద అంబర్‌పేట్ ప్రాంతంలో నూతన రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ పనులు =&దీ శాఖ ఆధ్వర్యంలో సుమారు ₹13 కోట్ల భారీ వ్యయంతో చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు =ఱజ చైర్మన్ మల్ రెడ్డి రామ్ రెడ్డి, పాల్గొని పనులకు శ్రీకారం చుట్టారు. పెద్ద అంబర్‌పేట్ ప్రాంతాన్ని ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో చేపట్టిన ఈ రోడ్ల నిర్మాణం ప్రజలకు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించడమే కాకుండా, ప్రాంతీయ అభివృద్ధికి బలమైన పునాది వేస్తుందని స్థానికులు భావిస్తున్నారు.
ఎమ్మెల్యే రంగారెడ్డి విజయం అనంతరం నియోజకవర్గంలోని గ్రామాలు, కాలనీల్లో రోడ్లు, అండర్‌డ్రైనేజ్ వంటి మౌలిక వసతులు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. గత ఎన్నో సంవత్సరాలుగా నిలిచిపోయిన అభివృద్ధి పనులు ఇప్పుడు కొత్త ఊపుతో ముందుకు సాగుతున్నాయి. ప్రతి గ్రామం, ప్రతి పట్టణం అభివృద్ధి దిశగా పయనిస్తున్న ఈ సమయంలో, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఒక మోడల్‌గా నిలుస్తుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది. ఎమ్మెల్యే రంగారెడ్డి, కృషితో అభివృద్ధి కొత్త దశలోకి అడుగుపెడుతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# మహాత్మా జ్యోతిబా పూలే ఆశయాలు స్ఫూర్తిగా ముందుకు సాగాలి, బీసీ సంక్షేమ శాఖ



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఏప్రిల్ 11:-
సామాజిక సంస్కరణలకు మార్గదర్శకుడిగా, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేసిన మహాత్మా జ్యోతిబా పూలే 199వ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి కేషు రాం ప్రధాన అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన బీసీ సంఘాల నాయకులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి, మహాత్మా జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడిన వారు, సమాజంలో అణగారిన వర్గాలకు విద్యా హక్కు కల్పించడంలో, మహిళల విద్యాభివృద్ధికి పూలే చేసిన కృషి అపారమని పేర్కొన్నారు. పూలే ఆశయాలు సమాజానికి మార్గదర్శకంగా నిలిచాయని, ముఖ్యంగా మహిళా సాధికారతకు ఆయన చూపిన దారి నేటికీ ప్రాసంగికమని అన్నారు. సమానత్వం, విద్యా విస్తరణ, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన పోరాటం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు. నేటి తరం పూలే ఆలోచనలను అనుసరించి సమాజ అభ్యున్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ ఫ్రంట్ చైర్మన్ జి మలేష్ యాదవ్, పీసీసీ కార్యదర్శి కొత్త కుర్మ శివకుమార్, రంగారెడ్డి జిల్లా బీసీ ఫ్రంట్ అధ్యక్షుడు కే కృష్ణ యాదవ్, జంగయ్య, బీసీ వెల్ఫేర్ శాఖ సిబ్బంది, వివిధ సంఘాల నాయకులు మరియు ఇతరులు పాల్గొన్నారు.

# మహిళా విద్యకు ఆద్యుడు పూలే

బర్కత్ పుర, ఏప్రిల్ 11: సమ సమాజం కోసం ఉద్యమించిన స్ఫూర్తి ప్రదాత, సామాజిక తత్వవేత్త మహాత్మా జ్యోతిరావుపూలే చిరస్మరణీయుడని సీనియర్ కాంగ్రెస్ నేత, జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు కొనియాడారు. జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా శనివారం బర్కత్పురలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జ్యోతిరావు చిత్రపటానికి పూలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతికి చదువు ఒక్కటే మార్గమని భావించిన మహనీయుడు పూలే అన్నారు. పూలే సిద్ధాంతాలు అందరికి ఆదర్శప్రాయమని అన్నారు. పూలే అలుపెరగని పోరాటం చేశారన్నారు. మానవుడి విద్య జ్ఞానజ్యోతి లాంటిదని పూలే విశ్వసించే వారన్నారు. బడుగు, బలహీన వర్గాలలో ఆత్మస్థైర్యం కల్పించి వారి హక్కుల కోసం పోరాటం చేయడంతో పాటు సాధికారత దిశగా కృషి చేశారన్నారు.





# మహాత్మ జ్యోతిరావుపూలే జన్మదిన సందర్భంగా ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులు

## -జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

## -పూలే జయంతి వేళ సామాజిక న్యాయం కోసం జాగృతి సంకల్పం

## -బీసీ ఉపకోటా వచ్చే వరకు పోరాటం ఆగదు: కవిత

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఏప్రిల్ 11:-
బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఘన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితతో పాటు నాయకులు పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన కవిత, పూలే ఆశయాలు నేటి సమాజానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. బీసీల హక్కుల కోసం జాగృతి చేస్తున్న పోరాటం పూలే మళ్లీ పుట్టాడా అన్న స్థాయిలో కొనసాగుతోందని ఆమె అన్నారు. ముఖ్యంగా మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు ఉపకోటా లేకపోవడం తీవ్ర నిరాశ కలిగించే విషయమని విమర్శించారు.
బీసీ మహిళలకు ఉపకోటా కల్పించే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేసిన ఆమె, అవసరమైతే ఢిల్లీకి వెళ్లి అన్ని పార్టీల నేతలతో ఈ అంశంపై చర్చిస్తామని తెలిపారు. పార్లమెంట్‌లో ఈ నెల 16, 17, 18 తేదీల్లో జరగనున్న మహిళా బిల్లుపై చర్చ సందర్భంగా కేంద్రంపై ఒత్తిడి పెంచుతామని చెప్పారు. పాలకులు తమ వద్ద అధికార బలం ఉందని బిల్లును ఏకపక్షంగా ఆమోదిస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించిన కవిత, బీసీ మహిళల హక్కుల కోసం కేంద్రం వెన్నులో వణుకు పుట్టేలా ఉద్యమం చేస్తామని ప్రకటించారు. మహాత్మా పూలే విగ్రహ ఏర్పాటు విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆమె మండిపడ్డారు. జయంతి నాటికి విగ్రహాన్ని పూర్తి చేయాలని కోరినా ఇప్పటికీ పనులు పూర్తికాలేదని అన్నారు. అసెంబ్లీలో విగ్రహం ఏర్పాటు చేయాలని కోరగా ట్యాంక్‌బండ్ వద్ద ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం చెప్పడం పాక్షిక విజయమని పేర్కొన్నారు. అయినప్పటికీ ఇప్పటివరకు అది కూడా అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంబేద్కర్ జయంతి నాటికైనా పూలే విగ్రహాన్ని పూర్తి చేయాలని డిమాండ్ చేసిన కవిత, పూలే జీవితం త్యాగం, పట్టుదల, సామాజిక న్యాయానికి ప్రతీకగా నిలిచిందన్నారు. సమాజంలో మార్పు తీసుకురావాలంటే ముందుగా మనలోనే మార్పు రావాలని, పూలే చూపిన మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. ఏ విప్లవమైనా త్యాగాల పునాదిపైనే నిలుస్తుందని, మార్పు కోసం పోరాడే వారికి ప్రారంభంలో ప్రతిబంధకాలు సహజమని ఆమె పేర్కొన్నారు. పూలే కూడా ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నప్పటికీ తన లక్ష్యాన్ని వదలలేదని గుర్తుచేశారు. అందుకే ఆయనను నేటికీ ప్రజలు స్మరించుకుంటున్నారని తెలిపారు.
ఇక విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఆటిజన్ల సమస్యలపై స్పందించిన కవిత, వారిని రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌తో వారు ఆందోళన చేపడితే కొత్తగూడెంలో వారిపై చర్యలు తీసుకోవడం తగదని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆటిజన్లు కొత్తగూడెంకు వెళ్లి నిరసన తెలుపుతున్నారని, వారి పోరాటానికి జాగృతి సంపూర్ణ మద్దతు ఇస్తుందని చెప్పారు.
గతంలో ఆటిజన్ల జీతాలు పెంచేందుకు జాగృతి కీలక పాత్ర పోషించిందని గుర్తుచేసిన ఆమె, వారికి నెలకు 40 వేల రూపాయల వరకు జీతం వచ్చేలా చేసిన కృషిలో తమ భాగస్వామ్యం ఉందని పేర్కొన్నారు. చివరగా, పూలే ఆశయాల సాధనకై సామాజిక న్యాయం కోసం అహర్నిశలు కృషి చేయడమే



ఆయనకు నిజమైన నివాళి అని కవిత పేర్కొన్నారు. బీసీ మహిళల హక్కులు సాధించే వరకు జాగృతి పోరాటం నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు

## అడ్డంకులు అడ్డుకాలేవు హోప్ ఫౌండేషన్ సేవలు ఆదర్శం

**రంగారెడ్డి జిల్లా బ్యూరో** సమాజ సేవలో ముందుండే హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్ కుమార్ సేవలు ప్రశంసనీయం అని స్థానికులు అభినందించారు. మానవతా దృక్పథంతో నిరంతరం అన్నదానం సహా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజంలో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. ప్రతి వారం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంలో భాగంగా ఈ శనివారం 179వ వారపు అన్నవితరణ కార్యక్రమం గంగారంలోని హోప్ ఫౌండేషన్ కార్యాలయం ప్రాంగణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొండా విజయ్ కుమార్ స్వయంగా పాల్గొని ప్రజలకు అన్నం వడ్డిస్తూ సేవాభావాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ఎవరూ ఆకలితో ఉండకూడదనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగిస్తున్నాం. ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చి భోజనం చేయడం మాకు ఆనందంగా ఉంది" అని తెలిపారు. హోప్ ఫౌండేషన్ సభ్యులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడం అభినందనీయం అని స్థానికులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హోప్ ఫౌండేషన్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

## బండారు శ్రీకాంత్ రావు కృషితో సాగునీరు విడుదల

### -కృతజ్ఞతలు తెలిపిన ఆయా గ్రామాల రైతులు

**వర్గల్ మండల**

వర్గల్ మండలంలోని వర్గల్,గుంటిపల్లి,శాకారం,గిర్మాపూర్, వేలూరు,నాచారం, మాదారం, అంబర్పేట్, దండుపల్లి, అనంతగిరిపల్లి, సీతారాంపల్లి రైతులు సాగుచేసిన వరి పంటకు నీరు అందక ఎండిపోతున్న తరుణంలో రైతులు ఈ విషయాన్ని వర్గల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అట్లా సందీప్ రెడ్డి తెలుపగా రైతుల సమస్యను టిపిసిసి అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్ రావుకు శుక్రవారం తెలుపగా వెంటనే స్పందించి ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి రైతుల సమక్షంలో ఇరిగేషన్ ఎఈ మురళీధర్ రెడ్డి శనివారం సంగారెడ్డి కాలువ ద్వారా హల్దీవగులోకి 200క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా వర్గల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అట్ల సందీప్ రెడ్డి మాట్లాడుతూ ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి నీటిని విడుదల చేయించిన రైతు కష్టాలు తెలిసిన రైతు బాంధవుడు టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్ రావుకు ఆయా గ్రామాల రైతుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాచారం దేవస్థానం బోర్డు మెంబర్ కూచారం సంతోష్ పంతులు, తీగుల్ మాజీ సర్పంచ్ కప్పరభానుప్రకాష్ రావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తూముకుంట విష్ణువర్ధన్ రెడ్డి, బూర్మెడ్డి హనుమంత్ రెడ్డి, భాస్కర్ మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతులు పాల్గొన్నారు





# విద్యుత్ ఆర్టిజన్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలి:

### - మెదక్ డివిజన్ కార్యాలయం ముందు ఆర్టిజన్ల నిరవధిక సమ్మె



మెదక్,ఏప్రిల్11(హైద్రాబాద్ ఎస్టేట్): విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మెదక్ విద్యుత్ డివిజన్ కార్యాలయం ముందు నాలుగవ రోజైన శనివారం తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టివిఏఈ జెఏసి) పిలుపు మేరకు ఆర్టిజన్లు నిరవధిక సమ్మె నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్టిజన్ లు మాట్లాడుతూ ఆర్టిజన్లకు నిబంధనల ప్రకారం ఏపిఎస్ఈబి సర్వీస్ రూల్స్ వర్తింపజేయాలని,2026 పిఆర్సి,మెడికల్ లీవులు మంజూరు,సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. గ్రేడ్ చేంజ్ పీస్ రేటు కార్మికులకు,అన్ మ్యాన్ కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పోల్ టు పోల్ కార్మికులకు న్యాయం చేయాలన్నారు. వినియోగదారులకు 24గంటలు నిరంతరాయంగా విద్యుత్ అందిస్తున్నా,తాము మాత్రం చాలీ చాలని జీతంతో జీవితాలను నెట్టు కొస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనారాష్ట్ర ప్రభుత్వం,యాజమాన్యం కల్పించుకుని తమకు రావాల్సిన న్యాయ పరమైన హక్కులను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఆర్టిజన్ల సమ్మెకు మద్దతుగా 1104 యూనియన్ మెదక్ డివిజన్ అధ్యక్షులు రాశీపురం నాగేష్ హాజరై మాట్లాడుతూ ఆర్టిజన్ల సమ్మె న్యాయ పరమైనదేనని,వారికి పూర్తి హక్కులు కల్పించేవరకు పోరాటం ఆగదన్నారు. మన డిమాండ్ అన్ని పూర్తి స్థాయిలో నెరవేర బోతున్నాయన్నారు. యాజమాన్యం రాష్ట్ర జెఏసి నాయకులతో చర్చించిన తర్వాతనే సమ్మె పూర్తిగా ఎత్తివేసి విధులకు హాజరవుదామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మన యూనియన్ ఏ పిలుపు ఇచ్చినప్పటికీ అందరూ సిద్ధంగా ఉండాలన్నారు. ఆర్టిజన్లు ఎన్ని రోజుల సమ్మెకైన సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో మహిళా ఆర్టిజన్లు ప్రణీత,స్వప్న, జ్యోతి,సుమలత, మానస,నాగమణి జెఏసి నాయకులు జంగం శరత్, శ్రీశైలం,శ్రీనివాస్, నాగరాజు,రమావత్ హరినాయక్,వెంకటచారీ, మొగులయ్య,రాజు గౌడ్, మోహన్,బాబునాయక్, శంకరప్ప,పరశు రామ్, నర్సింలు,సుధాకర్, సాయిలు,యాదగిరి,సూర్య రమేష్,శ్రీనివాస్ రెడ్డి,ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు. నాలుగవ రోజు డివిజన్ కార్యాలయం ముందు కార్మికుల వంటా వార్పు కార్యక్రమం నిర్వహించారు

## తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ వీరయ్య మానవత్వాన్ని మరోసారి చాటుకున్నారు.

ఏప్రిల్ 11,(హైదరాబాద్ ఎస్టేట్ ప్రజా ప్రతినిధి )మార్గమధ్యంలో ఒక చెట్టు కింద నిలబడిన రామచందర్ అనే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తను గుర్తించిన ఆయన, స్వయంగా వెళ్లి అతని పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. రామచందర్ తన ఇద్దరు కుమారులకు స్కూల్ ఫీజులు చెల్లించలేకపోవడంతో, ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం పరీక్షలకు అనుమతించలేదని వివరించాడు. దీనిపై వెంటనే స్పందించిన వీరయ్య, స్కూల్ యాజమాన్యంతో మాట్లాడి సమస్యను పరిష్కరించడంతో పాటు స్వయంగా ఆర్థిక సహాయం కూడా అందించారు. ఈ సందర్భంగా రామచందర్, వీరయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. వీరయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను ఎల్లప్పుడూ ఆదుకుంటుందని, వికలాంగుల కార్పొరేషన్ సేవలను మరింత ప్రజలకు చేరువ చేస్తామని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఏ సహాయం అవసరమైనా తన కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. అలాగే రామచందర్ కుమారులు ఎంతో ప్రతిభావంతులని కొనియాడుతూ, వారు ఉన్నత విద్యను అభ్యసించాలని, అవసరమైతే మళ్లీ తనను సంప్రదించాలని ప్రోత్సహించారు.



# అన్నారం ఎనికెపల్లి లో అక్రమ ఇసుక కుప్పలపై రెవెన్యూ దాడులు భారీగా ఇసుక కుప్పలు సీజ్

మెదక్,ఏప్రిల్11(హైద్రాబాద్ ఎస్టేట్):
పాపన్నపేట మండలంలోని అన్నారం గ్రామంలో రెవెన్యూ అధికారులు ఆకస్మికంగా దాడులు నిర్వహించి భారీగా ఇసుక కుప్పలను సీజ్ చేశారు. గ్రామ పరిధిలో అనుమతి లేకుండా నిల్వ ఉంచిన ఇసుక కుప్పలు ఉన్నాయన్న సమాచారంతో రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి శనివారం రోజు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం ఎనికే పల్లి గ్రామంలో 20ట్రాక్టర్ ల ఇసుక కుప్పలు సీజ్ చేశారు. రెవెన్యూ అధికారుల బృందం ఆయా గ్రామాల్లో పలు ప్రదేశాలను తనిఖీ చేసి అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను గుర్తించారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకున్న అధికారులు,ఇసుక కుప్పలను సీజ్ చేసి,వాటిపై హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకునే ప్రక్రియను ప్రారంభించినట్లు తెలిపారు. ఈసందర్భంగా అధికారులు మాట్లాడుతూ,ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక తవ్వకం,నిల్వ,రవాణా పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో అక్రమ ఇసుక రవాణా పెరగడం వల్ల పర్యావరణానికి నష్టం కలుగుతోందని,భూగర్భ జలాలు తగ్గిపోవడం,నదీ తీరాలు దెబ్బతినడం వంటి సమస్యలు ఏర్ప డుతున్నాయని అధికారులు పేర్కొన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి అక్రమ కార్యకలాపాలపై సమాచారం ఇవ్వాలని కోరారు. స్థానిక ప్రజలు అధికారుల చర్యలను స్వాగతిస్తూ,అక్రమ ఇసుక మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామ పరిసర ప్రాంతాల్లో ఇటువంటి చర్యలు కొనసాగితే అక్రమ కార్యకలాపాలు తగ్గుతాయని అభిప్రాయపడ్డారు.
ఈదాడుల్లో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.




## పాల్వంచ విద్యుత్ ధర్నాకు బయలు దేరిన నాయకులను అరెస్టు చేసిన పోలీసులు

మెదక్,ఏప్రిల్11(హైద్రాబాద్ ఎస్టేట్): తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీవిఏఈ జెఏసి) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శనివారం రోజు కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ (కేటిపిఎస్) పాల్వంచకు బయలు దేరివెళ్తున్న మెదక్ జిల్లాకు చెందిన జెఏసి నాయకులను మార్గమధ్యలో జూలూరుపాడు పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించినట్లు టీవీఏఈ జేఏసి జాయింట్ సెక్రటరీ బి.చంద్ర భానప్ప తెలిపారు. ఈసందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో పోన్ లో మాట్లాడుతూ శాంతి యుతంగా సమ్మెకు వెళ్తున్న తమను పోలీస్ లు అరెస్టు చేయటం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం,విద్యుత్ యాజమాన్యం ఆర్టిజన్ల సమస్యలను తీర్చక పోవడమే గాకుండా అక్రమంగా అరెస్టు చేయటం ఎంత వరకు సమంజసమని దుయ్యబట్టారు. గత నాలుగు రోజులుగా అన్ని డివిజన్ కార్యాలయాల ముందు తమ న్యాయ పరమైన డిమాండ్లను తీర్చాలని అడిగినందుకు మమ్మల్ని అడ్డుకోవటం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులు గత 20 సం.గాచాలీ చాలని జీతంతో వెట్టి చాకిరీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రనక,పగలనక,ఎండనక,వాననక వినియోగ దారులకు 24 గం.ల నాణ్యమైన విద్యుత్ ను అందిస్తుంటే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యుత్ కార్మికులను అరెస్టు చేయటం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం తక్షణమే జెఏసి నేతలతో చర్చలు జరిపి తమ న్యాయ పరమైన కోర్కెలు తీర్చాలని ఆయన డిమాండ్ చేశారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో సోమ శేఖర్, వసీం,విజయ్, నారాయణ గౌడ్,రంజిత్,రాజు తదితరులు ఉన్నారు. అరెస్టు చేసిన వారిని సాయంత్రం స్వంత పూచీకత్తుపై వదిలిపెట్టారు



# ఈనెల 25న చీర్యాల రామాలయం ప్రాంగణంలో హిందూ సమ్మేళనం

కీసర :
ఏప్రిల్ 11. ఈనెల 25 శనివారం రోజు సాయంత్రం చీర్యాల లోని రామాలయం ప్రాంగణంలో హిందూ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు హిందూ సమ్మేళనం సమితి అధ్యక్షుడు చిందం నాగేష్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం చీర్యాల రామాలయం సన్నిధిలో హిందూ సమ్మేళనం ఛైర్మెన్ చిందం నగేష్ ఆధ్వర్యంలో ముఖ్య అతిథిగా ప్రముఖ సినీ నటులు సి వి ఎల్ నరసింహ రావు పాల్గొని ఆహ్వానం పత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక ప్రతి ఒక్క హిందువు హిందూ సమ్మేళనంలో పాల్గొని జయప్రదం చేయుటకు కీసర మండలంలోని ప్రతి హిందువు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రామాలయం కమిటి ఛైర్మెన్ శివలింగాల శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచులు కోల అశోక్ యాదవ్, రామిడి వెంకట్ రెడ్డి, పులగుర్ల శ్రీనివాస్, తుంగ ధర్మేందర్, కోల కృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యా విప్లవానికి నాంది పలికిన మహానుభావుడు పూలే



కీసర :
ఏప్రిల్ 11. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, విద్యా విప్లవానికి నాంది పలికిన మహనీయుడు, సమాజంలో సమానత్వం, కోసం కృషిచేసి సామాజిక చైతన్యానికి మార్గదర్శకుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని తాజా మాజీ ప్రజాప్రతినిధులు, పలు పార్టీల నాయకులు కొనియాడారు. పూలే జయంతి సందర్భంగా శనివారం నాగారం, దమ్మాయిగూడలలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాగారం మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి, దమ్మాయిగూడ మాజీ కౌన్సిలర్ శ్రీహరి గౌడ్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొని మాట్లాడారు. సామాజిక, అసమానతలు తొలగించడమే పూలే ఆశయమన్నారు. సమానత్వం కోసం జీవితాంతం పోరాడిన మహోన్నత సంస్కర్తగా జ్యోతిరావు పూలే చిరస్థాయిగా నిలిచారని వారు కొనియాడారు. మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయాలను ప్రతి ఒక్కరూ పాటించాలని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, కాంగ్రెస్, టిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ముదిరాజ్ సంఘం అధ్యక్షులు జగన్మోహన్ రావు కుటుంబాన్ని పరామర్శించిన కవిత

బాలాపూర్
తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ సంఘం అధ్యక్షులు కొల్లూరు జగన్మోహన్ రావు గారి కుటుంబాన్ని పరామర్శించిన జాగృతి అధ్యక్షురాలు కవిత, గారు నాగోల్ గ్రామంలో ఇటీవల జగన్ మోహన్ రావు గారి మాతృమూర్తి శ్రీమతి లింగమ్మ గారు ,పరమపదించారు ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారి కుటుంబానికి మనోధైర్యాన్ని కల్పించారు ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం నాయకులు జాగృతి సంఘ నాయకులు ఎల్బీనగర్

## కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న పలు అభివృద్ధి,

### -సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు వివరణిచ్చిన ఎమ్మెల్యే

బూర్గంపాడు మండలం ,
ఈరోజు పినపాక నియోజకవర్గం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు బూర్గంపహాడ్ మండల కేంద్ర పరిధిలో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల నిమిత్తమై గౌతాపురం గ్రామ వేదికగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ సందర్శన, కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ ప్రారంభం చేసి ఒజూనియర్ కాలేజ్ -బాలికలురి అలాగే స్థానిక రెవిన్యూ కార్యాలయం నందు పేదింటి బిడ్డల సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ ప్రజాప్రభుత్వం అడబిడ్డలకు సహాయర్థంగా కళ్యాణలక్ష్మీ-షాదీ ముభారఖ్ పథకాలకు సంబంధించి సదురు అర్హులైన 452 మంది లబ్ధిదారులకు సుమారు 4బికోట్ల 52 లక్షల పైచిలుకు విలువగల చెక్కలను స్థానిక అధికారులు మరియు ప్రజాప్రతినిధుల సమన్వయంతో సంబంధిత నిరుపేద లబ్ధిదారులకు అందజేయడం జరిగింది.

# నేటి నుండి చీర్యాలా శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు

కీసర : ( శుభోదయం న్యూస్)
ఏప్రిల్ 11. చీర్యాల శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం 18వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నేటి నుండి బుధవారం వరకు నాలుగు రోజులపాటు అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ ఫౌండర్, చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ, ధర్మకర్త శ్రీహరి గౌడ్ లు తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని రంగులతో, రకరకాల పువ్వులతో అలంకరించారు. ప్రతి ఏటా లక్షలాదిమంది భక్తుల మధ్య అత్యంత భక్తిశ్రద్ధలతో బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. మొదటి రోజైన ఆదివారం సాయంత్రం 5 గంటలకు ఆలయ ఫౌండర్, చైర్మన్ మల్లారపు లక్ష్మీ నారాయణ ఇంటి నుండి చీర్యాల గ్రామం లోఊరేగింపు గా తిరిగి శ్రీ లక్ష్మి నరసింహస్వామి దేవాలయానికి చేరుకుంటారు. రెండవ రోజైన సోమవారం స్వామివారికి పంచామృత నవ కళాశాభిషేకం ,విశ్వక్సేన పూజ ,పుణ్యావచనం ,రక్షాబంధనం ,అఖండ జ్యోతి స్థాపన ,అంకురార్పణ ,అగ్ని ప్రతిష్ట, సుదర్శన నరసింహయాగం వివిధ పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయని వారు తెలిపారు. మూడవ రోజు అయిన మంగళవారం ఉదయం 10 గంటలకు శ్రీ యాదగిరిగుట్ట రిటైర్డ్ ప్రధానార్చకులు నల్లందిగులు నృసింహ చార్యులు ఆధ్వర్యంలో ఆలయ ఫౌండర్, చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ చేతుల మీదుగా శ్రీశ్రీశ్రీ చీర్యాల లక్ష్మీనరసింహస్వామి వారి తిరుకళ్యాణ మహోత్సవం, వేద పండితులచే మంత్రోచ్ఛారణ మధ్య ఘనంగా బ్రహ్మోత్సవాలు జరుగుతాయని వారన్నారు. నాలుగవ రోజు అయిన బుధవారం మహాపూర్ణాహుతి, శతఘటాభిషేకం ,అలంకరణ ,పంచహారతులు చక్రస్నానం తో ఈ యొక్క బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని తెలిపారు. ఈ బ్రహ్మోత్సవాల్లో నాలుగు రోజులు శ్రీశ్రీశ్రీ చీర్యాల లక్ష్మీనరసింహస్వామి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మూడు పూటలు నిత్య అన్నదాన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. అలాగే ప్రతిరోజు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ప్రతి సంవత్సరం కూడా స్వామి వారి బ్రహ్మోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేస్తారని, ఈ సంవత్సరం బ్రహ్మోత్సవ సమయం లో వేసవి సెలవులు కూడా



ఉండడంతో భక్తులు భారీ ఎత్తున వచ్చే అవకాశం ఉన్నదని వారు తెలిపారు. చీర్యాల టెంపుల్ నుండి సికింద్రాబాద్ స్టేషన్ వరకు ఆర్టీసీ బస్సు ఆరు ట్రిప్పులు నడుస్తాయని అన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయం వద్ద భక్తులకు మంచినీటి సౌకర్యం ,చలువ పందిర్లు, కేర్ హాస్పిటల్ వారిచే మెడికల్ క్యాంపు, ఈసీఐఎల్ సోలిస్ హాస్పిటల్ వారిచే ఉచిత మజ్జిగ పంపిణీ నిర్వహిస్తున్నట్టుగా ఆలయ ఫౌండర్, చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ తెలిపారు.

# సంక్షేమ పథకాల చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

బూర్గంపాడు మండలం , రిపోర్టర్ రఘువర్మ (శుభోదయం న్యూస్) :
బూర్గంపాడు మండల కేంద్రంలోని ఎంఆర్ఓ కార్యాలయంలో నిర్వహించిన కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో ముందంజలో ఉందని, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేసి, వారికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కె.ఆర్.కె ప్రసాద్, ఎంపీడీవో జమలారెడ్డి, స్థానిక పంచాయతీ సర్పంచ్ మంద నాగరాజు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, పశువైద్య అధికారి రాగూర్, మండల విద్యాశాఖ అధికారి ఎదుసింహారాజు, మండల హౌసింగ్ శాఖ అధికారి ఉదయ్ కిరణ్, సిడిపిఓ రేవతి, సర్పంచులు బాదం వెంకటేశ్వర రెడ్డి, బాబోయ్ పద్మ, గుండి బాబురావు, శర్ప నాగమణి, మంగమ్మ, కిషోర్, సరోజ, ఉపసర్పంచ్ గుండె వెంకన్న, డిప్యూటీ తహశీల్దార్ సమ్మయ్య, జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ భజన సతీష్, మాజీ పిఎసిఎస్ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, ఇంగువ రమేష్, యువజన కాంగ్రెస్ నాయకులు భజన ప్రసాద్, నియోజకవర్గ ఉపాధ్యక్షులు ఎడమకంటి సుధాకర్ రెడ్డి, కాటం వెంకట్రామిరెడ్డి, పూలపల్లి సుధాకర్ రెడ్డి, చల్లా వెంకటనారాయణ, మండల యూత్ ప్రెసిడెంట్ నిమ్మల హరీష్ యాదవ్, పోతు రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ దునుకు రాము, కైపు శ్రీనివాసరెడ్డి, సారెడ్డి అశోక్ రెడ్డి, తిరుపతి చంటి, బెల్లంకొండ రామారావు, టిడిపి మండల అధ్యక్షులు తాళ్లూరి జగదీష్ రావు, రహీం ఖాన్, దుగ్గెంపూడి సుశాంత్ రెడ్డి, చెంచలపు శ్రీనివాస్



రావు, చిప్పా రాజు, చిత్ర నాని, ఆర్పీ, రాజు, దాసరి సాంబ, బోనం నాగిరెడ్డి, వివిధ శాఖల అధికారులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అన్ని చోట్ల మహాత్మా జ్యోతిబాపూలే 199 వ జయంతి వేడుకలు

నాగార్జునసాగం
నాగార్జున సాగర్ నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని వివిధ ప్రాంతాలలో జరిగిన మహాత్మా జ్యోతి పూలే జయంతి కార్యక్రమాన్ని హిల్ కాలనీ మెయిన్ బజార్ ప్రొఫెసర్ జయశంకర్ భవన్ వద్ద మహారాజుల సేవా సంఘం,పూలే అంబేద్కర్ సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే 199 వ జయంతి వేడుకలను,బీసీ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ రవికుమార్, పైలాన్ కాలనీ లో వేమూరి బలరామ్ హై స్కూల్ నందు ప్రధానోపాధ్యాయులు పీ.శేషు ఆధ్వర్యంలో ఘనంగా జయంతి వేడుకలను నిర్వహించారు.మొదటగా వీరు మహాత్మ జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మహారాజుల సేవా సంఘం సభ్యులు,పూలే అంబేద్కర్ సేవా సమితి ప్రతినిధి,బీసీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్,మోడల్ హైస్కూల్ ప్రిన్సిపాల్ పీ.శేషు స్థానిక నాయకులు వారి ప్రాంగణంలో మాట్లాడుతూ సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి జీవితాంతం పోరాడిన మహోన్నత వ్యక్తి జ్యోతి రావు పూలే అని,ఆయన విద్య, సమానత్వం,మహిళా సాధికారత కోసం,సమాజంలో కులనిర్మూలన జరగాలని, అందరికి సమాన హక్కులు ఉండాలని,సామాజిక సమానత్వం కోసం ఆయన చేసిన సేవలు ఈ దేశ చరిత్రలోనే చిరస్థాయిగా నిలిచిపోతాయని,ఆయన ఆశయాలు ప్రజలందరికీ మార్గదర్శకమని ఇప్పటికీ ఆయన చూపిన మార్గంలో నడుస్తూ సమాజంలో ఉన్న ఆర్థిక అసమానతలను తొలగించేందుకు మనం అందరం కృషి చేయాలి అని వారు పేర్కొన్నారు.అనంతరం స్థానిక,మంజరి దయాగ్నస్టిక్, సెంటర్ వద్ద ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని స్థానిక పూలే అభిమానులు,స్థానిక నాయకులతో కలసి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మహారాజుల సేవా సంఘం సభ్యులు బద్రి, వీరబాబు,పుల్లారావు,పూలే అంబేద్కర్ సేవా సమితి ప్రతినిధి గోరంట్ల శివరాం ప్రసాద్,కాంగ్రెస్ పార్టీ,టిఆర్ఎస్ పార్టీ నాయకులు,బీసీ గురుకుల, మోడల్ హై స్కూల్ ప్రిన్సిపాల్స్ రవికుమార్,శేషు ఉపాధ్యాయ బృందం స్థానిక యువకులు,పూలే, అంబేద్కర్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.







